

మలుపుల్లో మృత్యుఘంటికలు

అన్నాసాగర్ చెరువు కట్ట వద్ద ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.

వివరాలు 8లో ▸



ట్యాంక్‌లో ఎలుక అవశేషాలు

నీటి ట్యాంక్‌లో ఎలుక అవశేషాలు ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు. వివరాలు 8లో ▸



నిత్యం ఎదురుచూపులే..

జిన్నారంకు వచ్చే ఆర్టీసీ బస్సుల సంఖ్య తక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ధరణి సమస్యలపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : ధరణి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. శనివారం కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతీరోజు వెయ్యికి తగ్గకుండా ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి, ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరి క్రాంతి జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా ధరణి దరఖాస్తులు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌ఓ పద్మజారాణి పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ పెంచాలి



మాట్లాడుతున్న అడివయ్య

జోగిపేట(అందోల్): దివ్యాంగుల పెన్షన్‌ను రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. శనివారం మార్కెట్ యార్డ్ ఆవరణలో అందోల్ డివిజన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా దివ్యాంగులకు రూ.4వేల నుంచి రూ.6వేలు, ఆసరా పెన్షన్‌ను రూ.2వేల నుంచి రూ.4వేలకు పెంచుతామని చెప్పి ఏడు నెలలు గడుస్తున్నా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జూలై 3న సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాయమ్మ, బస్వరాజు పాటిల్, మల్లేశం, పోచయ్య, ఇస్మాయిల్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



ఫిర్యాదులు వింటున్న డీఎం

నారాయణఖేడ్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. స్థానిక డిపోలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోన్ ద్వారా పలువురి నుంచి వచ్చిన ఫిర్యాదులు, సలహాలు విన్నారు. కల్హేర్ మీదుగా పిట్లంకు అలాగే వట్‌పల్లి, సదాశివపేట, వికారాబాద్, దర్గాషరీఫ్‌కు కల్హేర్ మీదుగా నిజాంసాగర్‌కు బస్సులు నడపాలని, న్యాల్కల్, డప్పూరు మీదుగా బీదర్‌కు బస్సు నడపాలని పలువురు కోరారు. హైదరాబాద్‌కు నిరంతరం సర్వీసు నడపాలని మరికొందరు కోరారు. ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు.

సహకార సంఘం వివరాలు లేవట


ఆర్టీఐలో బదులిచ్చిన అసిస్టెంట్ రిజిస్ట్రార్

చంచల్‌గూడ: సమాచార హక్కు చట్టాన్ని ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్యం చేస్తున్నాయని సైదాబాద్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త డి.శ్రీనివాస్ రావు శనివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. సహకార సంఘం యాక్ట్ కింద బండ్లగూడ పటాన్‌చెరువులో ఏర్పడిన ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి సంబంధించిన లేఅవుట్, రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్న పత్రాలను ఆర్టీఐ ద్వారా ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా సహకార సంఘం శాఖలో కోరామని చెప్పారు. అయితే ఆ వివరాలు తమ వద్ద లేవని జవాబిచ్చారని తెలిపారు. వివరాలు లేనప్పుడు సొసైటీ ఏర్పాటును ఎలా అనుమతించారని ప్రశ్నించారు.

బాధ్యులను శిక్షించాలి

సంగారెడ్డి టౌన్ : నీట్ పేపర్ లీకేజీ బాధితులను కఠిన శిక్షించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి డీఆర్‌ఓ పద్మజారాణికి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో జ్యుడీషియల్ కమిటీ వేసి విచారణ జరపాలన్నారు. పరీక్షను రద్దుచేసి రాష్ట్రాలకు నిర్వహణ బాధ్యత అప్పగించాలని కోరారు.

ఆ ఊరికి బయన్న అభయం



సండే స్పెషల్

గ్రామాల్లోని ప్రజలు సంస్కృతీ సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. అంతేకాకుండా వారికి దైవ భక్తి, నమ్మకాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. అలా ఒక ఊరిలోని ప్రజలు తమ ఇష్టదైవం పేరునే ఊరి పేరుగా మార్చుకున్నారు. అలాగే చాలామంది తమ కుటుంబ సభ్యులకు ఆ దేవుని పేరు పెట్టుకొని భక్తిని చాటుకున్నారు. ఆ గ్రామమే ఉమ్మడి పుల్కల్ మండలం కోడూరు.

– రాజలింగు బాలయ్య, సంగారెడ్డి :

ప్రతి ఇంటా బయన్న, బయమ్మలే..

- కోడూరులో ఏళ్లనాటి బయన్న ఆలయం
- దేవుని మొదటి అక్షరంతో ఊరంతా పేర్లు
- ఈ పేర్లతో అన్నీ శుభాలే కలుగుతాయని నమ్మకం
- గ్రామంలో 1500 మంది జనాభా

కోడూరు గ్రామంలో బయన్న దేవుడి ఆలయం ఉంది. వందల ఏళ్లనాటి చరిత్ర ఉన్న ఈ దేవాలయంలోని బయన్న దేవుడికి గ్రామస్తులు ప్రతీ ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తుంటారు. కులమతాలకతీతంగా బయన్న దేవుడిని కొలుస్తుంటారు. దేవుని మీద ఉన్న భక్తితో గ్రామంలోని కుటుంబాలు తమ ఇంట్లో పుట్టేవారికి బయన్న, బయమ్మ పేర్లు పెట్టుకుంటారు. లేదంటే 'బ' అక్షరంతో మొదలయ్యే పేర్లనయినా నామకరణం చేస్తుంటారు. దీంతో ఆ గ్రామంలో ప్రతీ ఇంటిలో బాలయ్య, బాలమ్మ, భాస్కర్, భాగ్యమ్మ పేర్లు ఒకరిద్దరికైనా ఉండటం విశేషం. ఆ పేర్లు పెట్టుకుంటే దేవుడు చల్లగా చూస్తాడని, అన్నీ శుభాలే కలుగుతాయని గ్రామస్తుల నమ్మకం.

ఎలాంటి ఆపదలు రావని..

గ్రామస్తులకు బయన్న దేవునిపై ఉన్న భక్తితో కోడూరును కాస్త బయన్న కోడూరుగా మార్చుకున్నారు. బయన్న ఆలయం గ్రామ ప్రధాన రహదారి ప్రారంభంలోనే ఉంటుంది. గ్రామంలో 1500మంది జనాభా ఉంది. ఇక్కడి ప్రజలు ఎక్కడికైనా వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ముందుగా బయన్న స్వామికి మొక్కుకుంటారు. అలాచేస్తే అనుకున్న పని తప్పక నెరవేరుతుందని భక్తుల నమ్మకం. గ్రామంలో ఏ శుభకార్యం జరిగినా బయన్నదేవునికి బోనాలు తీయడం ఆనవాయితీగా వస్తుంది. ఆ రోజు గ్రామ దేవతలన్నింటికీ బోనాలు తీసి.. చివరకు బయన్న గుడి వద్ద బోనాల ముగింపు కార్యక్రమం చేపడతారు. అక్కడ పూజారి ఇచ్చే బండారు తిలకంగా ధరించి తమ కోర్కెలు తీర్చాలని స్వామివారిని వేడుకుంటారు.

ఊరి పేరు మార్చాలని...

అధికారికంగా గ్రామానికి కోడూరు అని పేరు ఉంది. జిల్లాలో అనేక కోడూరు గ్రామాలు ఉన్నాయి. అయితే గ్రామాన్ని బయన్న కోడూరుగా మార్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అనధికారికంగా వారు ఇప్పటికీ బయన్న కోడూరుగా పిలుచుకుంటారు. అలాగే ఆలయానికి చుట్టూ ప్రహరీ మాత్రమే ఉంది. పైకప్పు కూడా లేదు. ఏళ్ల క్రితం నాటి ఈ ఆలయాన్ని ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

నిరాడంబర రూపంలో దర్శనం



కోడూరు గ్రామంలోని బయన్న స్వామి భక్తులకు నిరాడంబరంగా దర్శనం ఇస్తారు. స్వామివారికి ఎలాంటి దుస్తులు లేకుండా మొత్తం బండారుమయంగా కనిపిస్తాడు. దేవునికి మొత్తం పసుపుతోనే బొట్లు పెట్టి మొక్కులు తీర్చుకుంటారు. దీంతో విగ్రహం మొత్తం కాలభైరవునిగా దర్శనమిస్తూ గ్రామాన్ని ఎల్లవేళలా కాపాడుతాడని గ్రామస్తుల నమ్మకం. ఈ ఆలయం వద్ద పెద్ద ఊడలమర్రి చెట్టు కూడా ఉంది.

మా తాతల నాటి నుంచి..



గ్రామంలో బయన్న దేవుని పేరే ఎక్కువగా పెట్టుకుంటారు. మా తాతది అదే పేరు.. నేను పుట్టాక అదే పేరు పెట్టారు. బయన్న దేవుని పేరు పెట్టుకుంటే ఏ ఆపద కలగదని, అన్నీ శుభాలే ఉంటాయని నమ్మకం. అందుకే గ్రామంలోని ఆ పేరునే పెట్టుకుంటారు.

– చిన్నబాగు బయన్న

బయన్న కోడూరుగా మార్చాలి



మా గ్రామ దేవుని పేరును గ్రామం పేరుగా మార్చాలని మా అందరి కోరిక. ఆ దేవుడి ఆశీస్సులతో గ్రామం అంతా సుభిక్షంగా ఉంటుంది. ఏ పనులు మొదలు పెట్టాలన్నా ముందుగా బయన్న స్వామికి మొక్కుకుంటా.

– ఆత్కూరి బయప్ప

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్ : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జూలై 7న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించే కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తిలో నైపుణ్యత ఆధారంగా అవార్డు గ్రహీతలకు రూ.25వేల నగదు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. చేనేత కళాకారులు, డిజైన్ రంగంలో అనుభవం కలిగిన వారు శాంపిల్స్‌ను జిల్లా కార్యాలయంలో జూలై 10వ తేదీ వరకు సమర్పించాలన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడండి

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



అదనపు కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్: నియోజకవర్గంలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైంటిఫిక్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్క్‌ను పూర్తి చేయాలని కోరారు. పాత మాస్టర్ ప్లాన్‌లో ఇండస్ట్రియల్ జోన్లు ఉండటంతో ఇల్లు నిర్మించుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కొత్త ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పట్టణంలో శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, డీఈ ఇంతియాజ్ అహ్మద్, విఠల్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

సంగారెడ్డి టౌన్ : జిల్లా అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డీసీఓ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్, కోశాధికారిగా అఖిలేష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా వనజను ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు మరికొందరు ఎన్నికయ్యారు. అనంతరం వారు కలెక్టర్ క్రాంతిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అధికారుల సమస్యల కోసం కృషి చేస్తామని తెలిపారు.

మట్టి పరీక్షల్లో జహీరాబాద్ కేవీకే భేష్

ఉత్తమ సేవలకు తృతీయ బహుమతి

జహీరాబాద్: మట్టి పరీక్షల్లో ఉత్తమ కృషికి జహీరాబాద్‌లోని డీడీఎస్–కేవీకేకు తృతీయ బహుమతి లభించింది. ఈనెల 25నుంచి 27వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రిలో గల భారతీయ పొగాకు పరిశోధన స్థానంలో అటారీ జోన్–10 ఆధ్వర్యంలో నాలుగు రాష్ట్రాల వార్షిక జోనల్ సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన 72 కృషి విజ్ఞాన కేంద్రాల ప్రతినిధులు, పలు పరిశోధన సంస్థల డైరెక్టర్స్ పాల్గొన్నారు. 2023లో ఆయా కేవీకేలు నిర్వహించిన కార్యక్రమాలను బట్టి కేవీకేలకు పలు అవార్డులను అందజేశారు. జహీరాబాద్‌లోని డీడీఎస్–కేవీకే 2518 భూసార పరీక్షలను నిర్వహించడంతో పాటు కార్డులు అందజేసి, సమగ్ర ఎరువుల నిర్వహణలో భాగంగా సాధించిన ఘనతకు తృతీయ బహుమతిని దక్కించుకుంది. భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ డైరెక్టర్ ఎస్.ఎన్.మీరా చేతుల మీదుగా డీడీఎస్–కేవీకే సీనియర్ శాస్త్రవేత్త సి.వరప్రసాద్, డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.దివ్యలు అవార్డును అందుకున్నారు. అంతే కాకుండా విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణ, వార్షిక పనుల నివేదికలు సకాలంలో పూర్తి చేసినందుకు ప్రశంసా పత్రాలను అందజేశారు.



బహుమతి అందుకుంటున్న డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య

జెడ్పీటీసీల సహకారంతో అభివృద్ధి

నారాయణఖేడ్: జెడ్పీటీసీల సహకారంతో జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ అన్నారు. శనివారం ఆమె ఖేడ్‌కు వచ్చిన సందర్భంగా జెడ్పీటీసీ లక్ష్మీబాయినాయక్ స్వగృహంలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు. అనంతరం జర్నలిస్టు కాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవీ కాలం ముగుస్తున్న తరుణంలో జిల్లా అభివృద్ధికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సిర్గాపూర్ జెడ్పీటీసీ రాఘవరెడ్డి, కురుమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మల్గొండ తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటి నీళ్లు పోస్తున్న మంజుశ్రీ

రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయురాలి ప్రతిభ

వినూత్న బోధన పద్ధతికి గుర్తింపు

దుబ్బాక: మున్సిపల్ పరిధిలోని లచ్చపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న వి.మాధవి వినూత్న రీతిలో విద్యార్థులకు బోధించడంపై రాష్ట్ర స్థాయిలో గుర్తింపు చాటారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ (ఎస్‌ఈఆర్‌టీ) వారు ఉపాధ్యాయురాలి ప్రతిభను గుర్తించారు. వినూత్నమైన బోధన ఉపకరణాలు ఉపయోగించి విద్యార్థులను ఆకట్టుకునేలా బోధించారు. వారిలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు మాధవి కృషి చేశారు. ప్రతిభను గుర్తించిన ఎస్‌ఈఆర్‌టీ ఆమె సక్సెస్ స్టోరీని హార్బింజర్స్ ఆఫ్ ఛేంజ్ పుస్తకంలో ప్రచురించారు. గతంలో సైతం మాధవి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎన్నికై అవార్డును అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో లచ్చపేట పేరును నిలిపిన ఉపాధ్యాయురాలు మాధవిని గ్రామస్తులు అభినందించారు.



మాధవి

కేంద్ర మంత్రిని కలిసిన సంగప్ప

నారాయణఖేడ్: కేంద్ర పర్యాటక, భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని ఢిల్లీలోని ఆయన నివాసంలో శనివారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప మర్యాద పూర్వకంగా కలిశారు. పర్యాటకం, భారీ పరిశ్రమల విషయంలో తెలంగాణకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రిని కోరారు. ఆయన వెంట ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ ఉన్నారు.



కుమారస్వామిని కలిసిన జన్‌వాడే సంగప్ప తదితరులు



అభిప్రాయ సేకరణలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

ఝరాసంగం(జహీరాబాద్): రైతు భరోసా పథకంపై శనివారం ఝరాసంగం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ ఓఎస్డీ శ్రీధర్, ఎంపీపీ దేవదాసు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ నిర్మల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శంకర్ పాటిల్, సొసైటీ చైర్మన్ గౌసోద్దీన్, మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్, సీఈఓ నిసార్ అహ్మద్ పాల్గొన్నారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు పేర్కొన్నారు.

స్థానికం.. మరింత ఆలస్యం

- జూలై 4న ముగియనున్న ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం
- ప్రత్యేక పాలన వైపు ప్రభుత్వ యోచన
- బీసీ గణన అనంతరమే ఎన్నికలు
- నిరాశలో స్థానిక నాయకులు

నారాయణఖేడ్: రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో లేనట్లు కన్పిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఎంపీపీలు 25, జెడ్పీటీసీలు 25, ఎంపీటీసీలు 295 స్థానాలు ఉన్నాయి. ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం జూలై 4న, జెడ్పీటీసీల గడువు 5న ముగియనుంది. ఈలోపే ఎన్నికలు నిర్వహిస్తారని స్థానిక నేతలు గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం ఆ ఊసెత్తడం లేదు. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. దాన్ని పొడిగించకుండా ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించింది. ఇక స్థానిక సంస్థల పదవీకాలం కూడా ముగుస్తుండడంతో వారిని కొనసాగిస్తారా, లేక ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగిస్తారా అనే విషయంపై చర్చ సాగుతోంది. ప్రత్యేక అధికారుల పాలనకే ప్రభుత్వం మొగ్గు చూపనున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

బీసీ గణన అనంతరమే..

గత ఎన్నికలు జరిగినప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లు పదేళ్లపాటు కొనసాగాలని అప్పటి ప్రభుత్వం చట్టం రూపొందించింది. ఇప్పటి ప్రభుత్వం ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే. బీసీ జనగణన చేపడితే రిజర్వేషన్ల మార్పుపై కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. దీంతో పదేళ్ల రిజర్వేషన్లు అనుమానమే.

పార్టీ పటిష్టం కోసం

రాష్ట్రంలో మెజార్టీ స్థానిక సంస్థలకు బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు ఉన్నారు. జిల్లాలో కూడా ఇదే పరిస్థితి ఉంది. దీంతో కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నట్లు సమాచారం. అధికారులను తమకు అనుగుణంగా మలచుకొని స్థానిక సంస్థల్లో పాగా వేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

బాధ్యతల్లో అధికారులు

మండల పరిషత్తులకు జూలై 4న పదవీకాలం ముగియడంతో మరుసటి రోజు నుంచి ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి రానుంది. జిల్లా వ్యాప్తంగా 25 మండలాలు ఉండగా.. ఒక్కో మండలానికి ఒక్కో ప్రత్యేక అధికారి రానున్నారు. పలు శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించేందుకు కసరత్తు జరుగుతోంది.



మండల పరిషత్ కార్యాలయం

ఉత్తర్వులకు అనుగుణంగా నిర్ణయం



స్థానిక సంస్థల విషయంలో ప్రభుత్వం జారీచేసే ఉత్తర్వులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటాం. పాలన పొడిగింపు, ప్రత్యేక అధికారుల నియామకం గురించి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ప్రభుత్వం నిర్ణయం మేరకు ఏర్పాట్లు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– కె.జానకీరెడ్డి, జెడ్పీ సీఈఓ, సంగారెడ్డి

మలుపుల్లో మృత్యుఘంటికలు

అన్నాసాగర్ చెరువు కట్ట ప్రారంభం నుంచి ముగింపు వరకు పది చోట్ల మలుపులున్నాయి. ఇవి ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలవడంతో స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరునెలల్లో పది మంది మృతి.. 50 మందికిపైగా క్షతగాత్రులయ్యాయి. దీనికి కారణం మలుపుల వద్ద ముళ్ల చెట్లు రోడ్డును ఆక్రమించడమేనని తెలుస్తోంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

6 నెలల్లో.. పది మంది మృత్యువాత

- 50 మందికిపైగా క్షతగాత్రులైన వైనం
- అన్నాసాగర్ చెరువుకట్టపై ప్రాణాంతకంగా ప్రయాణం
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో వాహనదారులు



జోగిపేట(అందోల్): నాందేడ్-అకోలా జాతీయ రహదారిపై ఉన్న అన్నాసాగర్ చెరువు కట్టపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇది సుమారుగా కిలోమీటర్ వరకు ఉంటుంది. పది చోట్ల మలుపులు ఉన్నాయి. 6 నెలల వ్యవధిలో చోటుచేసుకున్న ప్రమాదాల్లో 10 మంది వరకు మృతి.. 50కి పైగా క్షతగాత్రులయ్యారు. చెరువుకట్ట మొదలు నుంచి చివరి వరకు ఏపుగా ముళ్లపొదలు, చెట్లు పెరిగాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు రెండువైపులా ముళ్లచెట్లను తొలగించే విషయమై రోడ్డు భవనాల శాఖ అధికారులను కలిస్తే తమకు సంబంధం లేదంటున్నారు. నేషనల్ హైవే అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండకపోవడంతో ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిగా ఇదే పరిస్థితి ఉందన్నారు.

ఆదమరిస్తే అంతే...

చెరువు కట్టపై ప్రయాణించే సమయంలో ఆదమరిస్తే ప్రమాదం పొంచి ఉంటుంది. ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టడమో లేక పక్కనున్న చెరువులోకి వాహనం దూసుకు వెళ్లిపోవడమో జరుగుతోంది. చాలా సార్లు లారీలు సైతం చెరువులోకి దూసుకు వెళ్లిన సంఘటనలున్నాయి. జేసీబీల సాయంతో తిరిగి బయటకు తీయించారు కూడా. ఎక్కువగా ద్విచక్ర వాహనదారులే ప్రమాదానికి గురవుతున్నారు. కాగా, చెరువు కట్టపై వారానికోసారి ప్రమాదం జరుగుతుంది. ఈ దారి గుండా నారాయణఖేడ్, నాందేడ్, అకోలా, బీదర్ ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఎక్కువగా వెళుతుంటాయి. బైపాస్ రోడ్డు ఏర్పాటుతో కొంత వాహనాల రద్దీ పెరిగినా ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. నారాయణఖేడ్ వైపు నుంచి జోగిపేటకు వచ్చే ఆర్టీసీ, లారీ వాహనాలకు బైక్‌లు ఢీకొని మృతిచెందిన సంఘటనలు చాలా ఉన్నాయి.



అన్నాసాగర్ కట్టపై ప్రమాదకర మలుపు

ముళ్ల చెట్లను తొలగించేందుకు చర్యలు

అన్నాసాగర్ పెద్ద చెరువుపై కట్టపై రెండు వైపులా ముళ్ల చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టర్ దొరకకపోవడంతో కొంత ఆలస్యం జరుగుతుంది. వారం రోజుల్లో తొలగిస్తాం. అప్పటివరకు వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలి. మలుపుల వద్ద వేగంగా వెళ్లవద్దు.

– రాము, ఆర్అండ్‌బీ డిప్యూటీఈఈ

రాత్రివేళలో రాంసానిపల్లి, నేరడిగుంట, దానంపల్లి, కన్‌సాన్‌పల్లి ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగి మృతిచెందుతున్నారు. ఇప్పటికైనా ముళ్ల చెట్లను తొలగించాలని స్థానికులు, ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ రఘోతం రెడ్డి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి

నర్సాపూర్ రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రాఘోతం రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అచ్చంపేట ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కుందుర్తి శ్రీనివాస్ పదవీ విరమణ అభినందన సభలో ఆయన మాట్లాడారు. పండితుల ప్రమోషన్లు ఇప్పించామన్నారు. మిగిలిన వారికి కూడా ప్రమోషన్లు, బదిలీలు త్వరలో పూర్తి చేయిస్తామన్నారు. పెండింగ్ డీఏలను మంజూరు చేస్తామన్నారు. వచ్చేనెల నుంచి ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం స్కావెంజర్‌లను నియమిస్తోందన్నారు. దీంతోపాటు పాఠశాలల కరెంట్ బిల్లులు సైతం ప్రభుత్వం చెల్లించేందుకు నిధులు మంజూరు చేస్తుందన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

MSR Developers కొరకు తెలంగాణ / ఆంధ్రాల్లో మార్కెటింగ్ సిబ్బంది కావలెను & మీరు ఉన్న ఏరియాల్లోనే లేఅవుట్ వెండర్ ఫాం ల్యాండ్ పార్ట్‌నర్స్ కావలెను. ఫోన్: 8499940666 [H-189680]

HOUSE FOR SALE

Independent Houses For Sale @ Malkapur, Sangareddy 141 S/Y 1100 sft Top Quality Built-Up, E/F with N-E Entrance. Ready to Occupy, Prime Location, Bank Loan Avail. Ph: 9063510400, 9391003272 [HA-97776]

WANTED

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి/భోజనం జీతం : 18K ఫోన్: 9160900024 / 9640400073 [H-799897]

ఫామ్ హౌస్ ల్యాండ్స్ ప్లాంటేషన్ గార్డెన్ చేయబడును. వంద గజాల నుండి ఎన్ని ఎకరాల వరకు అయినా వాటిలో మంచి ఆదాయం పొందడానికి పండ్ల చెట్లు మరియు పూల చెట్లు మరియు సుగంధ ద్రవ్య చెట్లు ప్లాంటేషన్ చేయబడును మరియు మైయిటైన్ చేయబడును. అనుభవం గల సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. సెల్ : 98482 91986, 99080 64399 [H-1214477]

పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-800412]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185231]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ట్యాంక్‌లో ఎలుక అవశేషాలు

- హెచ్‌ఎం పట్టించుకోలేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన
- ఎంఈఓ హామీతో శాంతించిన ఆందోళనకారులు



నీటి ట్యాంకులో చనిపోయిన ఎలుక అవశేషాలు

కొల్చారం(నర్సాపూర్): నీటి ట్యాంక్‌లో ఎలుక అవశేషాలు ఉన్నాయని, ఈ విషయాన్ని హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ''రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 7 తరగతి వరకు 60 మంది విద్యార్థులు చదువుతున్నారు. నలుగురు ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాల విద్యార్థుల నీటి అవసరాలు నిమిత్తం రెండు ప్లాస్టిక్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. అందులో ఒక ట్యాంక్‌కు పైకప్పుగా మూత లేదు. విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో ప్లేట్లను శుభ్రపర్చుకుంటారు. కొందరు తాగుతున్నారు. మూడు రోజుల నుంచి వాడుతుండగా నీటి దుర్వాసన రావడంతో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన నుంచి సరైనా స్పందన రాకపోవడంతో తమ తల్లిదండ్రులకు చెప్పారు. ఓ విద్యార్థి తండ్రి మధ్యాహ్నం పాఠశాలకు చేరుకున్నాడు. పాఠశాల పైకప్పు ఎక్కి ట్యాంకులు పరిశీలిస్తే చనిపోయిన ఎలుక అవశేషాలు కనిపించాయని'' అన్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నిస్తే ఎలుకను నేను వేశానా? అని అంటూ ఎదురు సమాధానం చెప్పాడు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి తండ్రి మరికొంతమంది అక్కడి చేరుకొని ప్రధానోపాధ్యాయుడిని పాఠశాల గదిలో బంధించి ఆందోళనకు దిగారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ, ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదని తల్లిదండ్రులు వాపోయారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ పాఠశాలకు చేరుకొని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో శాంతించారు. కాగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమేశ్ పాఠశాలకు చేరుకొని, సిబ్బందితో కలిసి మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఎలాంటి ఆందోళనకు గురి కావలసిన అవసరం లేదన్నారు. 24 గంటల వరకు గ్రామంలో తాను, వైద్య సిబ్బంది విద్యార్థులకు అందుబాటులో ఉంటామన్నారు.



స్కూల్‌లో విచారిస్తున్న ఎంఈఓ

పూడికతీత పనులు చేస్తుండగా..

- మురుగుకాల్వలో పడి కార్మికుడి మృతి
- చింతకుంట గ్రామంలో ఘటన



ప్రకాశ్(ఫైల్)

వట్‌పల్లి(అందోల్): మురుగు కాల్వ శుభ్రం చేస్తూ ప్రమాదవశత్తు అందులోనే పడి పంచాయతీ కార్మికుడు మృతిచెందాడు. ఈ విషాద అందోల్ మండల చింతకుంటలో శనివారం చోటుచేసుకుంది. పంచాయతీ కార్యదర్శి శ్రీవిద్య తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కూల్‌కు చెందిన జగ్గంపేట ప్రకాశ్ చింతకుంటలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం కూడా ఉదయం విధులకు హాజరై మరో కార్మికుడు వెంకటేశ్‌తో కలిసి మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో వెంకటేశ్ భోజనం చేసి వస్తానన్నాడు. తాను మాత్రం తినకుండా కాసేపు అక్కడే విశ్రాంతి తీసుకొని మరలా కాల్వ పూడికతీత పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు అదే కాల్వలో పడి మృతిచెందాడు. ఇంతలో వెంకటేశం వచ్చి మృతదేహాన్ని చూసి విషయాన్ని వెంటనే స్థానికులు పంచాయతీ కార్యదర్శికి తెలియజేయగా ఇక్కడికి చేరుకున్నారు. విచారించి ఎంపీడీఓ, ఎంపీఓ, డీఎల్పీలతో పాటు జోగిపేట పోలీసులకు కూడా సమాచారం అందించారు. గ్రామ పంచాయితీ తరపున బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని పంచాయతీ కార్యదర్శి అందజేశారు.

పెన్షన్ హామీ అమలేదీ?

- దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు
- 3న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాకు పిలుపు



మాట్లాడుతున్న దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల సమయంలో ఆసరా పెన్షన్లు పెంచుతామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగమయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు బస్వరాజ్ డిమాండ్ చేశారు. శనివారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాబ్ కా సాత్ సాబ్ కా వికాస్ అంటున్న కేంద్ర ప్రభుత్వం కూడా పెన్షన్స్ ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా పెంచకుండా దివ్యాంగుల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ప్రస్తుతం వచ్చే పెన్షన్లతో బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులతో పాటు ఇతర పెన్షన్‌లు రూ.4వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా వాగ్దానాల అమలు గురించి ధ్యాసలేదని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయం కోసం 44,49,767 మంది ఆసరా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసిన 24.84 లక్షల మందికి వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జులై 3న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ధర్నాలలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు యశోద, ఉపాధ్యక్షుడు గౌతమ్ పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక..

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

తూప్రాన్: హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసిన ఉదంతం పట్టణ పరిధిలోని పోతరాజుపల్లిలో శనివారం చోటుచేసుకుంది. వసతి గృహం ప్రిన్సిపాల్ వందన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం మండలం గిన్నాయిపల్లికి చెందిన విద్యార్థిని వారం రోజుల క్రితం 7వ తరగతిలో చేరింది. వసతి గృహంలో చదివేందుకు ఇష్టం లేకపోవడంతో 2 రోజుల క్రితం తల్లిదండ్రులు నచ్చజెప్పి వెళ్లారు. శనివారం దురద మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులకు తెలపడంతో వెంటనే స్థానికంగా ఉన్న సీహెచ్‌సీకి తరలించారు. బాలిక చికిత్స పొందుతుంది. తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఇక్కడికి చేరుకున్నారు. అలాగే విద్యార్థిని ఆరోగ్య పరిస్థితులను ఆస్పత్రి సూపరింటెండెంట్ అమర్‌సింగ్‌ను అడిగి ఆర్డీఓ జయచంద్రారెడ్డి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.

కాటేసిన కరెంట్ తీగ



శ్రీనివాస్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ఇంటికి నీరు పట్టడానికి మోటార్‌ను ఆన్ చేస్తే విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని గౌతోజీగూడెంకు చెందిన పూల శ్రీనివాస్ తన ఇంటికి మరమ్మతు పనులు చేయిస్తున్నాడు. శనివారం ఉదయం ఇంటికి నీళ్లు పట్టడానికి మోటార్‌ను ఆన్ చేసి విద్యుత్ వైర్ సరి చేస్తుండగా తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ మేరకు భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుళ్లిన తినుబండారాలు..

- కాలంచెల్లిన శీతల పానీయాలు
- బేకరీపై దాడులతో వెలుగులోకి



గజ్వేల్‌లో బేకరీ నిర్వాహకులకు జరిమానా విధిస్తున్న అధికారులు

గజ్వేల్: ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న బేకరీపై శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. ఆ మేరకు నిర్వాహకులకు జరిమానా విధించారు. పట్టణంలోని బెంగుళూర్ అయ్యంగార్ బేకరీలో కుళ్లిపోయిన కేకులు, కాలం చెల్లిన కూల్ డ్రింక్‌లు విక్రయిస్తున్నారని ఫిర్యాదు రాగా, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తనిఖీలు చేపట్టారు. అందులో నిజమేనని తేలడంతో రూ.10వేల జరిమానా విధించారు. పరిశుభ్రతను పాటించకుండా ప్రజారోగ్యంతో చెలగాటమాడే విధంగా వ్యవహరిస్తే 2019 మున్సిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

ఆరుకు చేరిన మృతుల సంఖ్య

చేగుంట రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తి మృతి



చేగుంట(తూప్రాన్): మెదక్ జిల్లా చేగుంట శివారులో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృత్యుల సంఖ్య ఆరుకు చేరింది. ఈ ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతిచెందినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఇప్పటికే ఈ ప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. వారిని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. అందులో తీవ్రంగా గాయపడిన మధ్యప్రదేశ్ రీవా జిల్లాకు చెందిన రమేశ్ ఆలియాస్ రాజేశ్(40) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు. కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు మృతుల కుటుంబాలకు తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి ఆర్థిక సాయం అందించి మృతదేహాలను తరలించేందుకు అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు.

కుక్కల దాడిలో 14 గొర్రెల మృత్యువాత



మృతిచెందిన గొర్రెల వద్ద పేర్ని కుంటయ్య తదితరులు

చిన్నకోడూరు(సిద్దిపేట): కుక్కల దాడిలో 14 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండల పరిధిలోని గోనెపల్లిలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పేర్ని కుంటయ్య శనివారం మధ్యాహ్నం వర్షం పడుతుండటంతో గొర్రెల మందను పాకలోకి తోలాడు. ఎక్కడి నుంచో వచ్చిన కుక్కల గుంపు ఒక్కసారిగా దాడి చేయగా 14 గొర్రె పిల్లలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఆ మేరకు సుమారు రూ. 50 వేల నష్టం వాటిల్లినట్టు బాధిత రైతు వాపోయాడు. గొర్రెల కాపర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి యాదవ్ బాధితుడికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

946 మంది పిల్లలను రక్షించాం

సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: మిస్సింగ్ చిల్డ్రన్స్ కేసులను ట్రేసవుట్ చేయాలని సీపీ అనురాధ తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్ నిర్వహణపై చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మికశాఖ, విద్యాశాఖ, వైద్యారోగ్యశాఖ అధికారులు, పోలీసు అధికారులతో కలిసి సీపీ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ ద్వారా ఇప్పటి వరకు 946 మంది పిల్లలను రక్షించినట్లు తెలిపారు. బాల కార్మికులు పనిచేసే స్పాట్స్‌ని గుర్తించి టీమ్స్‌తో వెళ్లి దాడులు చేయాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. చిన్న పిల్లలను ఎవరైనా వెట్టిచాకిరీకి గురి చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రత్యేకంగా ప్రతి డివిజన్ పరిధిలో ఎస్ఐ, నలుగురు సిబ్బందిని నియమించామన్నారు. చిన్న పిల్లలతో ఎవరైనా వెట్టిచాకిరీ చేయించినా వారిని హింసించినా, బెదిరింపులకు గురి చేసినా డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ 87126-67100 నంబర్‌లో సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, పలు శాఖల అధికారులు రాజలింగం, రాము, మమత, ప్రతిమ, యాదగిరిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసుల్లో శిక్షల శాతం పెంచాలి

కేసులలో శిక్షల శాతం పెంచాలని సీపీ అనురాధ అన్నారు. తన కార్యాలయంలో కోర్టు డ్యూటీ విధులు నిర్వహించే సిబ్బందితో కలిసి సీపీ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్స్ కేసుల్లో శిక్షల శాతం పెంచాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులలో ట్రయల్ సమయంలో సంబంధిత ఇన్వెస్టిగేషన్ అధికారులు తప్పకుండా మానిటర్ చేయాలని సూచించారు. నూతన చట్టాలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఐటీ కోర్ ఎస్ఐ నరేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు, కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

బావిలో దూకి ఒకరు..

కుటుంబ కలహాలతో ఉరేసుకొని మరొకరు

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య



రాజు(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): మతిస్థిమితం లేని ఓ యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని శమ్నాపూర్‌లో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొరంకల శేఖమ్మ, నర్సింహుల ఏకైక కుమారుడు రాజు(26)కు కొంత కాలంగా మతిస్థిమితం సరిగా ఉండటంలేదు. గురువారం రాత్రి కుటుంబీకులు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం ఉపాధి హామీ కూలి పనులు నిర్వహిస్తుండగా కూలీలు.. బావిలో శవం ఉన్నట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. ఇది గ్రామానికి చెందిన రాజుగా గుర్తించారు. అనారోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జిన్నారంలో..



మౌనిక మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గుమ్మడిదల మండలం కొత్తపల్లిలో శనివారం జరిగింది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నారాయణపూర్‌కు చెందిన మౌనిక(26)కు, గుమ్మడిదల మండలం కొత్తపల్లికి చెందిన కె.పోచయ్యతో 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. నెల రోజుల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన మౌనిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

టిప్పర్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్

సిద్దిపేటకమాన్: అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్లను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. శ్రీనివాస్, మల్లేశ్ యాదవ్, మాటిండ్ల గ్రామానికి చెందిన లింగం, శ్రీకాంత్‌లు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు నమ్మదగిన సమాచారం వచ్చింది. దీంతో శనివారం వెళ్లి టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక డంపులు స్వాధీనం



నంగునూరులో ఇసుక డంపులను చూపుతున్న పోలీసులు

నంగునూరు(సిద్దిపేట): భారీ ఎత్తున ఇసుక డంపులను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నంగునూరు లోని జోకిరమ్మ బండ, రామాలయంతోపాటు వ్యవసాయ క్షేత్రాలు, ప్రభుత్వ భూముల్లో కలిపి 18 చోట్ల మొత్తంగా 190 ట్రిప్పుల ఇసుక డంపులను రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను తదుపరి చర్యల నిమిత్తం నంగునూరు తహసీల్దార్ సరితకు అప్పగించారు. ఇప్పటికే పలు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామని, వాగులోంచి ఇసుక తోడితే స్థానికులు పోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్ఐ కోరారు. నంగునూరు మండలం గుండా పారే మొయతుమ్మెద వాగు నుంచి నంగునూరు, ఖాత, అక్కేనపల్లి, ఘణపూర్ గ్రామాల వద్ద కొందరు వ్యక్తులు అక్రమంగా ఇసుక తోడుతున్నారని, అధికార పార్టీ నాయకుల అండదండలతో పంట పొలాల్లో ఇతర ప్రాంతాల్లో ఇసుక డంపులు ఏర్పాటు చేశారని తెలుస్తోంది.

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

తెలుగు పత్రికా రంగంలో కొత్త పోకడలకు, సరికొత్త అంచనాలకు శ్రీకారం చుట్టిన 'సాక్షి' మిమ్మల్ని తన కుటుంబంలోకి సాదరంగా ఆహ్వానిస్తోంది. జర్నలిజం పట్ల ఆసక్తి, తెలుగులో సూటిగా సరళంగా రాయగల నేర్పుంటే చాలు... మీరు 'సాక్షి'లో కంట్రిబ్యూటర్లుగా చేరవచ్చును.

కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు

1) మెదక్ అర్బన్, 2) మెదక్ రూరల్, 3) సంగారెడ్డి రూరల్, 4) సంగారెడ్డి అర్బన్, 5) సంగారెడ్డి ఎడ్యుకేషన్, 6) సంగారెడ్డి క్రైం, 7) కోహీర్, 8) మనూర్, 9) దౌల్తాబాద్

పరీక్ష తేది : జూన్ 30, ఆదివారం ఉ. 11.00 గం.లకు

నిబంధనలు : 1) అభ్యర్థులు 40 ఏళ్లలోపు వారై ఉండాలి 2) తెలుగు కంపోజింగ్ చేయగల నేర్పు కలిగి ఉండాలి. 3) కనీస విద్యార్హత : డిగ్రీ

SAKSHI
SAKSHI DIGITAL MEDIA GROUP

పరీక్షా కేంద్రం : సాక్షి దినపత్రిక జిల్లా కార్యాలయం, నందిని కాంప్లెక్స్, 1వ అంతస్తు, ఐడీబీఐ బ్యాంక్‌పైన, కొత్త బస్టాండ్ ఎదురుగా, సంగారెడ్డి. ఫోన్ నం.లు : 9705346792, 9908322511